జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 22-1-2025 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 225 పేజీలు: 4 వెల : రూ.7





☞అధ్యక్షుడిగా ఏకగ్రీవం ☞అభినందనలు తెలిపిన పార్టీ శ్రేణులు ☞పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: సిరిపురపు

## బీజేపీ శ్రీకాకుళం రథసారథి..

# తేజేశ్వరరావు

శ్రీకాకుళం, జనవరి21 (వార్త): భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా సిరిపురపు తేజేశ్వరరావు ఎన్నికయ్యారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలోని టౌన్ హల్ ఎదురుగా ఉన్న శ్రీ ఫంక్షన్ హాల్‌లో నూతన అధ్యక్షుడి ఎన్నికలు నిర్వహించారు. ఈపదవికి ఆరుగురు పోటీపడ్డారు. జిల్లా ఎన్నికల అధికారిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెయిల్ డైరెక్టర్ కాశీవిశ్వనాథ్ రాజు, ఎన్నికల పరిశీలకులుగా డాక్టర్ సుహాసిని ఆనంద్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా చల్లా వెంకటేశ్వరులు వ్యవహరించారు. బిర్లంగి ఉమామహేశ్వరరావు, శివ్వాన ఉమామహేశ్వరి, సంపతిరావు నాగేశ్వరరావు, సలాన రాఘవరావు, పైడి రాజారావు, సిరిపురపు తేజేశ్వరరావు నామినేషన్లు వేశారు. కాశీవిశ్వనాథ్ రాజుతో పాటు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పార్టీ శ్రేణులు, నేతల అభిప్రాయాలను సేకరించారు. చివరకు సిరిపురపు తేజేశ్వరరావును పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించారు. అనంతరం తేజేశ్వరరావుచే ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన తేజేశ్వరరావును పార్టీ నేతలు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రధానమంత్రి మోదీ అమలు చేస్తున్న



పథకాలు ప్రజల్లోకి తీసుకువెళతామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథ్ రాజు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# చిక్కినకాడికి స్వాహా!

* పంచాయతీల్లో యథేచ్ఛగా నిధుల దుర్వినియోగం
* హౌస్ ట్యాక్స్, ప్లాన్లు పేరిట కార్యదర్శుల కలెక్షన్లు
* నేతలతో కుమ్మక్కు *లంచావతారులుగా కొందరు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది
* పంచాయతీల్లో జాడలేని మరికొందరు కార్యదర్శులు * ఇదేంటని అడిగితే అధికారులతో మీటింగ్‌లంటూ పొంతనలేని సమాధానాలు
* పంచాయతీల్లో కార్యదర్శుల పంచాయితీ
*విధులకు డుమ్మా కొట్టి నేతల చుట్టూ చక్కర్లు

శ్రీకాకుళం, జనవరి 21 (వార్త): జిల్లాలోని పలు పంచాయతీల్లో కార్య దర్శులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. పంచాయతీకి చెందాల్సిన సొమ్మును సొంత అవసరాలకు వాడుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు ఉన్నాయి. జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, పన్నుల వసూళ్లలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కొందరు కార్య దర్శులు పంచాయతీ కార్యాలయం, సచివాలయాలకు రాకుండా కాలక్షేపం చేస్తున్నారు. ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళుతున్నారో తెలియడం లేదు. సమస్యలపై ఎవరైనా ఫోన్ చేస్తే స్పందించిన దాఖలాలు లేవు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ప్రశ్నిస్తే మండల అధికారులతో సమావేశాలకు వెళుతున్నామని కహానీలు చెబు తున్నారు. పంచాయతీల్లో చెత్త పేరుకుపోయినప్పటికీ డబ్బులు లేవన్న మిషతో పట్టించుకోవడం మానేస్తున్నారు. కొందరు కార్య దర్శులు రాజ కీయ అండదండలు ఉన్నాయని, తమకేం చేయ లేరన్న ధీమాతో వ్యవహరిస్తున్నారు. పంచాయతీ పాలనావ్యవహారాలు చూడాల్సిన కార్యదర్శులు.. గ్రామ రాజకీయాల్లో కొందరు ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్షంగా పాల్పంచుకుంటూ నేతల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా లోని పలు పంచాయతీల్లో కార్యదర్శుల తీరు, ఇళ్ల పన్నుల పేరిట ఎంతెంత దోచుకున్నారు, ప్లాన్లు పేరిట ఏ మేరకు బొక్కేశారు, అక్రమ మార్గంలో డబ్బులు వసూళ్లు, ఆర్థికసంఘం నిధులు దుర్వినియోగం, సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులపై త్వరలో 'జాతీయ వార్త'లో కథనాలతో వెలుగులోకి తీసుకువస్తుంది.

# రైతు అనుమానాస్పద మృతి

* విద్యుత్ షాక్ అంటున్న మరికొందరు
* హత్య చేశారంటున్న కుటుంబీకులు, ప్రజాసంఘాలు
* ఆసుపత్రి వద్ద ప్రజా సంఘాల ఆందోళన
* కొద్ది రోజులుగా భూవివాదాలు
* ఆరా తీస్తున్న పోలీసులు




**పలాస, జనవరి 21 (వార్త):** రామకృష్ణాపురం పవర్‌గ్రిడ్ రోడ్డులో పొలం వద్ద ఓ రైతు తెప్పల డిల్లీరావు మృతి కలకలం సృష్టించింది. కొందరు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడని అంటుండగా, కుటుంబీకులు మాత్రం రియల్టర్లే కరెంట్ షాక్ ఇచ్చి చంపేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పలాస మండలం నీలావతి గ్రామంలో ఢిల్లీరావు భార్య, పిల్లలతో నివాసముంటున్నాడు. రామకృష్ణాపురం గ్రామానికి సమీపంలో కౌలు భూములున్నాయి. వీటి విషయంలో కాశీబుగ్గకు చెందిన రియల్ ఎస్టేట్‌దారులు, ఓ వైద్యునితో ఢిల్లీరావుకు వివాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై ప్రజాసంఘాల నాయకుల వద్దకు పంచాయితీ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఢిల్లీరావు ఇంటి నుంచి బైక్‌పై రామకృష్ణాపురం భూముల వద్దకు వెళ్లాడు. రాత్రి 9 గంటలైనా తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు రామకృష్ణాపురంలోని పొలం వద్ద వెతుకుతుండగా మంటల్లో కాలిపోతున్న ఢిల్లీరావును గుర్తించాడు. పొలాలకు గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు అమర్చడంతో వాటిని తాకి మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం వేకువజామున ఘటనా స్థలానికి కాశీబుగ్గ పోలీసులు చేరుకొని ఢిల్లీరావు మృతదేహానికి పలాస ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, తన భర్త ఢిల్లీరావు మృతిపై భార్య కమల అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు, క్లూస్ టీమ్ సభ్యులు చేరుకుని వివరాలు సేకరించారు. విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకున్నారు. భార్య కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జి.సంజీవరావు తెలిపారు. అయితే గ్రామస్థులు, ప్రజాసంఘాల నేతలు ఇది ముమ్మాటికీ హత్యేనని ఆరోపిస్తున్నారు. ఢిల్లీరావు మృతి చెందిన తీరు పరిశీలిస్తే ఇది ముమ్మాటికీ హత్యగానే కనిపిస్తోందని ప్రజాసంఘాల ప్రతినిధులు మద్దిల రామారావు, పత్రి దానేసు, వంకల మాధవరావు, పిండి వెంకటరావు ఆరోపించారు. ఈ మేరకు ఆసుపత్రి వద్ద ప్రజా సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఢిల్లీరావును హత్య చేసేందుకు విద్యుత్ తీగలను అమర్చివుంటారని ఆరోపించారు. హంతకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# ఆదిత్యనగర్‌లో.. వ్యభిచారం



* గుట్టుచప్పుడు కాకుండా ఓ ఫ్లాట్‌లో నిర్వహణ
* దాడి చేసిన రూరల్ పోలీసులు
* పోలీసుల అదుపులో ఇద్దరు మహిళలు
* కేసు నమోదు





**శ్రీకాకుళం క్రైం, జనవరి 21 (వార్త):** శ్రీకాకుళం రూరల్ పరిధిలోని ఆదిత్యనగర్‌లోని ఓ ఫ్లాట్‌లో మూడు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం జరుగుతోంది. ఓ మహిళ ఇంటిని అద్దెకు తీసు కుని వ్యభిచార కేంద్రాన్ని నడుపుతోంది. ఈవిషయమై గుర్తు తెలియని వ్యక్తులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వన్‌టౌన్ సీఐ పైడపునాయుడు, రూరల్ ఎస్ రాము మంగళవారం పోలీసులతో కలిసి ఈ వ్యభిచార గృహంపై దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మీడియాతో మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు ఆదిత్యనగర్‌లోని ఓ ఫ్లాట్‌పై దాడి చేశామన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ పైడపునాయుడు తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 24న సుకన్య సమృద్ధి యోజన మేళా

**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** శ్రీకాకుళం తపాలా డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ నెల 24న సుకన్యసమృద్ధి యోజన మేళా నిర్వహిస్తున్నామని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ వండాన హరిబాబు తెలిపారు. ఈ మేళాలో 3500 సుకన్య సమృద్ధి ఖాతాలు ప్రారంభించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. 10 సంవత్సరాలలోపు బాలికల పేరిట ఖాతా తెరవవచ్చన్నారు. ఖాతా కాల పరిమితి 21 సంవత్సరాలని తెలిపారు. బాలికకు 18 సంవత్సరాలు నిండితే ఉన్నత విద్యకు గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉన్న మొత్తంలో 50శాతం వరకు విత్ డ్రా చేసుకోవచ్చన్నారు. వివాహానికి నెల రోజులు ముందు గానీ, వివాహానంతరం మూడు నెలల లోపు పథకాన్ని ఉపసంహరించుకోవచ్చన్నారు. ఒక ఆర్థిక సంవత్సరానికి కనీసం రూ.250 నుంచి గరిష్టంగా రూ.1,50,000 వరకు పొదుపు చేయవచ్చని తెలిపారు. ఖాతాలో జమ చేయబడిన సొమ్ము మొత్తానికి పన్ను మినహాయింపు కలదన్నారు. ఖాతాను ఏ తపాల కార్యాలయానికైనా బదిలీ చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు. పూర్తి వివరాల కోసం మీ దగ్గరలో ఉన్న తపాలా కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

# చంద్రబాబు కృషితోనే ఉక్కుకు ఆర్థిక భరోసా

-ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కు కర్మాగారానికి ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళంలోని విశాఖ ఏ కాలనీలో గల తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్రకే గాక యావత్ ఆంధ్ర రాష్ట్రానికి మణిహారం విశాఖ కర్మాగారం అన్నారు. వేలాది మంది తెలుగోళ్లు వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లి వచ్చిన ప్రతీసారి ఏపీ కేంద్రం శుభవార్త చెప్తూనే ఉందన్నారు. ఆర్థిక సంక్షోభంలో పూడుకుపోయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసిందని తెలిపారు. విశాఖ ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్ ప్రయత్నిస్తే.. ఏ విధంగా పరిరక్షించాలని చంద్రబాబు ఆహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే రూ.18 వేల కోట్లు అవసరమని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ భరత్ తదితరులు విన్నవించిన కొద్ది రోజులకే ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్లు చొప్పున మొత్తం రూ.1,650 కోట్లను రెండు విడతల్లో కేంద్రం ఆర్థిక సాయం అందించిందన్నారు. తప్పుడు కూతలతో వైసీపీ ఎంత దుష్ప్రచారం చేసినా వారి మాటలను వినే పరిస్థితుల్లో ప్రజలు లేరని వారు స్పష్టం చేశారు. సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆడంబరంగా జాతీయ బాలికా దినోత్సవం



**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** ఈ నెల 24న దేశవ్యాప్తంగా ఆడపిల్లల కేరింతల మధ్య జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం సారథ్యాన శ్రీకాకుళం పట్టణంలోని బెహరా మనో వికాస కేంద్రం విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి ప్రారంభించారు, విందు, వినోదాలు, ఆటలు, పాటలు నడుమ ముందస్తుగా జాతీయ బాలికా దినోత్సవ సంబరాలు మంగళవారం జరుపుకుంటుండడం హర్షణీయమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. కేంద్రం ప్రాంగణంలో ముందుగా విద్యార్థులకు అల్పాహార విందుతో ప్రారంభంమైన ఈ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బాలికలకు బహుమతులు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం ప్రత్యేక విందుతో కార్యక్రమం ముగిసింది. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి సీతారాం మాట్లాడుతూ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం పిల్లల సేవా కార్యక్రమాలు ప్రారంభ సూచికగా విభిన్న ప్రతిభావంతులైన పిల్లల మోముల్లో హర్షాతిరేకాల మధ్య ఈ కార్యక్రమం ఫోరంకు చిరస్థాయిలో మరువలేని గుర్తులుగా ఉంటాయని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో పాటు పిల్లలకు ఉపయుక్తంగా ఉండే రక్తదాన శిబిరాలతో పాటు వివిధ రకాల ఉచిత వైద్య శిబిరాలు నిర్వహణకు అడుగులు వేయాలని అన్నారు. దేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న పౌష్టికాహార లోపం,వివిధ చట్టపరమైన ఎన్నో హక్కులు అమలుకు నోచుకోకపోవడం, బాల్య వివాహాలు జరుగుతుండడం, విద్య పూర్తి స్థాయిలో అందకపోవడం,మారు మూల ప్రాంతాల్లో వైద్య సంరక్షణ అందకపోవడం, ఆడపిల్లలకు సమాజంలో ప్రత్యేక గౌరవం దక్కకపోవడం వంటి వివిధ దీర్ఘకాలిక సమస్యలపై పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు చేపట్టి సమాజాన్ని తట్టిలేపడమే ఈ దినోత్సవ ముఖ్య లక్ష్యమని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్ని చట్టాలు అమలులో ఉన్నా నిత్యం ఆడపిల్లలపై వేధింపులు అఘాయిత్యాలు జరుగుతుండడం విచారకరమని అన్నారు. వీటిని రూపుమాపేందుకు ప్రభుత్వాల సహాయ సహకారాలతో పాటు సమాజంలో బాలల శ్రేయస్సుకు పని చేస్తున్న ఎన్జీవోలు, వివిధ సంఘాలు చేయూతనందించాలని పిలుపునిచ్చారు. చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి మాట్లాడుతూ తాము ఐదు రోజులు పాటు ఈ జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నామని అన్నారు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమానికి ఉపయుక్తంగా ఉండే వివిధ కార్యక్రమాలను రూపకల్పన చేయనున్నామని చెప్పారు. నిత్యం బాలల వెన్నంటి ఉండే చక్కని ఫోరం గా నిలిచేందుకు ప్రణాళికలతో ముందుకెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంఘాల ప్రతినిధులు మెట్ట మల్లేశ్వరరావు, కొత్తకోట శ్రీనివాసరావు, మొదలవలస వాసుదేవకుమార్, సింగూరు ప్రవీణ్, పైడి బాలకృష్ణ, బగాది ప్రవీణ్, మోహిని, పి.మాధురి, కేంద్రం నిర్వాహకులు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ మద్దతు



**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి మద్దతును అందిస్తుందని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ కుమార్ నేతృత్వంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనలతో ఏర్పాటు చేసిన తల్లిపాల ప్రత్యేక కేంద్రాన్ని మంగళవారం ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణ, పరిరక్షణ, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో విస్తృత కేటాయింపులు జరుపుతోందన్నారు. జిల్లా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో డాక్టర్ హరనాథ్ గారి ఆర్థిక సహకారముతో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా ప్రధాన బస్ కాంప్లెక్స్‌ల్లో వీటిని ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కాంప్లెక్స్ ప్రాంగణంలో బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చి ప్రయాణికుల్లో బాలల చట్టాలపై అవగాహనా కలిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ తల్లిపాలు పట్టే ప్రత్యేక కేంద్రం ప్రారంభం, కాంప్లెక్స్ ప్రాంగణంలో బాలల చట్టాలు, అవగాహనా కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల హోర్డింగ్స్ అభినందనీయమన్నారు. శ్రీకాకుళం ప్రజా రవాణా అధికారి విజయకుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సూచనలు, సలహాలు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలను పాటిస్తూ బాలల హక్కుల పరిరక్షణకు శ్రద్ధ చూపే ఆర్టీసీ కాంప్లెక్స్‌లుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2వ డిపో మేనేజర్లతో పాటు పలువురు సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



## మెమోలో అసంబద్ధాలను తొలగించాలి

**వంగర, జనవరి 21(వార్త):** గత ప్రభుత్వం విద్యాశాఖలో అమలు చేసిన జీవో నెంబర్ 117ను సవరణ చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిన మెమోలో గల కొన్ని అసంబద్ధాలను సరిచేయాలని యూటీఎఫ్ వంగర మండల శాఖ అధ్యక్షుడు ఎం.ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం వంగరలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయాలని, మిగిలిన అన్ని ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని, ప్రతీ ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5తరగతులు ఉండాలని, ఫౌండేషన్ స్కూల్ విధానం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గౌరవ అధ్యక్షుడు సీర అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాల వ్యవస్థ కూడా కొనసాగాలని వాటిలో సబ్జెక్టు టీచర్స్‌తో బోధన చేయించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలో రెండు మీడియంల విధానం అమలు చేయాలని కోరారు. అనంతరం వారి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం మండల విద్యా శాఖాధికారి వై.దుర్గారావుకి అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పెంకి గౌరీశంకరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.రవి కుమార్, యస్.లక్ష్మణరావు, టి.దుర్గారావు, జి.శ్రీనివాసరావు, ఆర్వీ రమణ, కన్వీనర్ బి.చంద్రమౌళి, సీపీఎస్ కమిటీ సభ్యులు పి.శ్రీరామమూర్తి, బి.రమేష్, బి.దుర్గారావు, ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వరరావు, యం.లక్ష్మీనారాయణ, యంవీ రమణారావు, బీవీ శ్రీరామమూర్తి, బి.దివాకర్, సీహెచ్ నాగరాజు, జి.భాస్కరరావు పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రాల ద్వారా..
## ధాన్యం కొనుగోలు చేయాలి



**మందస, జనవరి 21(వార్త):** రైతుల వద్దనున్న ధాన్యాన్ని పూర్తి స్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘంజిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు, మండల కార్యదర్శి ఎం.ధర్మారావు డిమాండ్ చేశారు. మందసలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం నిబంధనలు పేరుతో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం నమోదు చేయడానికి అధికారులు రోజువారీ టార్గెట్లు నిర్ణయించి, ఉదయం 6గంటలు తరువాత సాయంత్రం నాలుగు గంటల లోపు మాత్రమే నమోదు చేయాలని నిబంధన పెట్టారన్నారు. దానిని ఆసరా చేసుకుని మిల్లర్లు ప్రైవేటుగా కొన్న ధాన్యాన్ని ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా తెచ్చిన ధాన్యాన్ని తమకు అనుకూలంగా ఉన్నవారి పేర్లతో రాత్రి ఒంటి గంటకే తప్పుడు పద్ధతుల్లో ఎంట్రీలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఉదయం ఎంట్రీ కోసం వెళ్లిన రైతులకు అప్పటికే టార్గెట్లు అయిపోయావని, మిల్లర్లుకు బ్యాంక్ గ్యారంటీ లేదని అధికారులు నిరాకరిస్తున్నారన్నారు. దీంతో వారాల తరబడి రైతులు ధాన్యం అమ్ముకోలేక ఆఫీసుల చుట్టూ తిరగవలసి వస్తుందన్నారు. రైతులు వద్ద ధాన్యం కొనుగోలు చేయకుండా తప్పుడు పద్ధతులు అనుసరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకొని, రోజువారీ టార్గెట్లను తొలగించి రైతులు వద్దనున్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.అంగదా, కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు

**మందస, జనవరి 21(వార్త):** మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతిల ఆధ్వర్యంలో నారాయణపురం, సరియాపల్లిలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. రెండు సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాలలో వ్యాధి నిరోధక టీకాలు వేయడం, దూడలకు అంతర పరాన్నజీవులు మందులు తాగించడంతో పాటు శిబిరానికి తీసుకువచ్చిన పశువులకు చికిత్స చేశారు. పాడి రైతులకు పశు పోషణలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి గొరకల కేశవరరావు, బొంగు దామోదరం, సివంగి మురళి, మడియా ధర్మారావు, మడియా మోహన్, జనార్ధన, విజయ్ కుమార్, గొరకల వెంకటరావు తదితర పాడి రైతులు, సిబ్బంది ధర్మేంద్ర, బాలకృష్ణ, శ్రీను, సంతోషి, హరికృష్ణ, నిత్యానందం, కళ్యాణ్, నేతాజీ, లక్ష్మి, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమా, మురళి, ఇంతియాజ్, ఎంఏవీసీ సిబ్బంది డాక్టర్ దేవి, శ్రావణి, వంశీ పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేడు మెగా రక్తదాన శిబిరం

**పలాస, జనవరి 21 (వార్త) :** తోటి ప్రాణాన్ని కాపాడుకునే అవకాశం మనం చేతుల్లోనే ఉందని, యువత అంతా చేయి చేయి కలుపుదామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు.పలాసలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. గ్లో ఆధ్వర్యంలో ఈ నెల 22 న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్తదానంతో నలుగురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఏడాదికి మూడు నుంచి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని వైద్యులు చెబుతున్నట్లు తెలిపారు. రక్తదానం ఆవశ్యకతను వివరిస్తూ స్వచ్ఛంద సంస్థలు సమర్థమైన పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. పలాస నియోజకవర్గ వ్యాప్తంగా వెయ్యి యూనిట్ల రక్తాన్ని సేకరించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. ఎటువంటి అపోహలకు తావీయకుండా యువత రక్తదానానికి ముందుకు వచ్చి మానవత్వం చాటుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.





## మడ్డువలస, తోటపల్లి కాలువలు బాగు చేయండి

**-రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్**

**రాజాం, జనవరి 21 (వార్త):** ఖరీఫ్ సీజన్‌లోపు రైతులు ఇబ్బందులు పడకుండా మడ్డువలస, తోటపల్లి కాలువలను బాగు చేయాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అధికారులను కోరారు. మంగళవారం ఆయన విజయనగరం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని, నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించారు. బొద్దాం నుంచి రాజాం రోడ్డు, వంగర మండలం అరసాడ నుంచి నీలయ్య వలస రోడ్డు, సంతకవిటి మండలంలోని పలు రోడ్ల సమ స్యలను వివరించారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి ఎన్ఆర్‌జీఎస్ నిధులు త్వరితగతిన మంజూరు చేయాలన్నారు.

## దివ్యాంగునికి వీల్‌చైర్ వితరణ



**మందస, జనవరి 21(వార్త):** మందస మండలంలోని బైరిసారంగపురం గ్రామానికి చెందిన తమ్మినేని జోగారావు కొద్ది నెలల క్రితం మధుమేహ వ్యాధితో ఒక కాలుని తొలగించారు. సొండిపూడి గ్రామానికి చెందిన మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కరరావు గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వీల్ చైర్ ను అందజేశారు. మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ ఆయనకు కృత్రిమ కాలు ఏర్పాటు చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఔగాన ఈశ్వరరావు, చింతాడ లక్ష్మీనారాయణ, అల్లుమల నారాయణరావు, కర్రి దుర్యోధన పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు

**-అందించిన జనసేన పార్టీ**

**పలాస, జనవరి 21(వార్త):** పలు ప్రభుత్వ కార్యాలయాలకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటోలు అందజేసిన పలాస జనసేన పార్టీ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో పలు ప్రభుత్వ అటవీ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, అగ్నిమాపక, భద్రతా విభాగ కార్యాలయలకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు వెళ్లి సంబంధిత అధికారులకి అందచేయటం జరిగింది. పవన్ కళ్యాణ్ చెప్పింది తూ.చ తప్పకుండా పాటిస్తాం అని, అధికారం అంటే బాధ్యత అని. ప్రజలకు ప్రభుత్వాన్ని దగ్గర చేసి పాలన సౌలభ్యం చేసేందుకు మావైపు ప్రయత్నం ఎప్పుడు చేస్తాం అని నాయకులు అనటం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు హరీష్ కుమార్ శ్రీకాంత్, పలాస నియోజకవర్గ సీనియర్ నాయకులు కోన కృష్ణారావు, పుక్కల ఉమా శంకర్, జిల్లా కార్యక్రమాల కమిటీ సభ్యుడు లైశెట్టి గిరీష్, సంకు శ్రీకాంత్, కిషోర్, సర్వవరపు ప్రదీప్, కార్తీక్, రవి, కృష్ణ తధితరులు పాల్గొన్నారు.




# జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

**-ఎమ్మెల్యే గొండు శంకర్**

**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలో స్థానిక డిఎల్టిసి ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో నిరుద్యోగులైన యువతీ యువకులకు సీడ్ ఆఫ్,స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నిర్వహిస్తున్న ఉద్యోగ అవకాశాల కార్యక్రమాన్ని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ ప్రారంభించారు. వివిధ కార్పొరేట్ సంస్థలు, ఫార్మా కంపెనీలు అపోలో, సీనర్జీస్, వంటి అనేక సంస్థలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటుచేసిన ఉద్యోగమేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యుల శంకర్ కోరారు. కార్యక్రమంలో సీడ్ ఆఫ్, స్కిల్ డెవలప్మెంట్ అధికారులు, ప్రభుత్వ ఐటిఐ అధ్యాపకులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతకు శత శాతం లక్ష్యాలు సాధించాలి



**మందస, జనవరి 21(వార్త):** మహిళా సాధికారత కోసం ప్రభుత్వ ఆశయం మేరకు నిర్దేశించిన శత శాతం లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు కోరారు. మందసలోని స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సిబ్బంది సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి స్వయం శక్తి సంఘం లో కూడా సభ్యురాలు అవసరం మేరకు అంతర్గత అప్పులు ఇప్పించడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. నిధులు సరిపోని పరిస్థితిలో గ్రామ సంఘం ద్వారా స్త్రీనిధి ఋణాలను సక్రమముగా వినియోగించుకొని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. ప్రతి స్వయం శక్తి సంఘం కూడా వారి గ్రామ సంఘం లో విధిగా పొదుపు చేయాలని తెలిపారు. అన్ని గ్రామ సంఘాలు కూడా మండల సమాఖ్యలో సేవింగ్స్ ను ఉంచుకోవచ్చన్నారు. ప్రతి చిన్న సంఘం కూడా వారి పొదుపులు, అప్పులు, ఆదాయాలు అన్నింటిపై సభ్యులందరికీ అవగాహన వచ్చే విధంగా కమ్యూనిటీ ఆడిటర్లతో విధిగా ఆడిట్ చేయించుకోవాలన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రభుత్వం మంజూరు చేసిన వన్ దన్ వికాస కేంద్రాలను పారదర్శకత్వంతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావుతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్ నిర్వహణలో లోపం లేదు

**పలాస, జనవరి 21 (వార్త):** నిర్వహణలో లోపలు ఏమి కనిపించలేదని, నిబ్బందులకు అనుకూలంగా పనిచేస్తుందని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేయన రామారావు అన్నారు. పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని కాశీబుగ్గ పాత బస్టాండ్ రోడ్లో గల అన్న క్యాంటీన్ ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ అకస్మాత్తుగా బ్రేక్ ఫాస్ట్ సమయంలో తనిఖీ చేసారు. క్యాంటీన్లో అప్పటికే అల్పాహారం (టిఫిన్)తింటున్న పబ్లిక్ ను ఆహార నాణ్యత విషయమై వాకబు చేశారు. అదేవిధంగా ఆహార నాణ్యతను, అన్న క్యాంటీన్ వెలుపల, లోపల శానిటేషన్ పరిస్థితిని సమీక్షించారు. త్రాగునీటి నాణ్యతను పరిశీలించి, టిఫిన్లో ఇచ్చే సాంబార్ నాణ్యత తక్కువగా ఉందని నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. టిఫిన్లలో ఇచ్చే ఉప్మా రుచికరంగా లేదని పేరుకుంటూ, అన్న క్యాంటీన్ మొత్తం కలియ తిరిగి నిర్వహణకు సంబంధించిన అన్ని విషయాలను నిశితంగా పరిశీలించారు.



ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా నిరుపేదలకు అన్నం పెట్టాలనే మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ను పక్కాగా సక్రమంగా, ప్రభుత్వ నిర్దేశిత నియమ నిబంధనలకు అనుగుణంగా నడిపించాలని, ఆహార నాణ్యతను, పరిశుద్ధ తాగునీటిని, పారిశుద్ధ్య నిర్వహణను విధిగా మెంటైన్ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ తనిఖీలో కమిషనర్ వెంట అన్న క్యాంటీన్ నోడల్ అధికారి దగ్గర. డి ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు.

# జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



**మందస, జనవరి 21(వార్త):** ఏజెన్సీ, ఉద్ధానం ప్రాంతాలలో ప్రధాన పంట జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి.. ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని శ్రీకాకుళంజిల్లా గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం నాయకులు కోరారు. కుసుమలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో స్థానిక ఎంఎల్ఏ జీడి రైతాంగానికి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలన్నారు. గిట్టుబాటు ధరలకు కల్పిస్తూ ఉత్తర్వుల జారిచేయాలని, జీడి కా ర్పోరేషన్ ఏర్పాటు చేయాలని, జీడిపంటకు క్రిమిసంహారక మందులు తక్షణమే ప్రభుత్వమే రైతులకు అందించాలన్నారు. మాకివలస గ్రామములో గిరిజనులపై దాడులను, అణిచివేత నిలిపివేయాలని, గిరిజనులు చెందిన భూములు పట్టాలు మంజూరు చేయాలన్నారు. పచ్చని వాతావరణానికి మారు పేరైనా ఉద్ధాన ప్రాంతం నాశనం చేస్తూ కూటమి ప్రభుత్వం, కేంద్రా ప్రభుత్వాలు చేపట్టే కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం బలవంతపు భూసేకరణ అపాలన్నారు. సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగింతలు ఆపివేయాలని, గత ప్రభుత్వం నియమించిన వాలంటీర్ వ్యవస్థ కొనసాగించాలన్నారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు సవర నరసింహులు, ఉపాధ్యక్షుడు దాశరథి, హరికృష్ణ, సెక్రటరీ జగన్, యేసయ్య, గౌరవ అధ్యక్షుడు సుధాకర్, లక్ష్మణరావు, నరసింహులు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం కోనేరు రమేష్, మందస మండలంలోని వివిధ గ్రామాల నుంచి జీడి రైతులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సొండిపూడి జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ

**మందస, జనవరి 21(వార్త):** సొండిపూడి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఉద్దానంలోని నారాయణపురంలో జరిగిన టాలెంట్ టెస్ట్ లో ద్వితీయ స్థానం రూ.4444ల నగదు, మెమెంటో, అల్లిమెరకలో జరిగిన టాలెంట్ టెస్ట్ లో కన్సొలేషన్ బహుమతి గెలుచుకొని పాఠశాలకు పేరు తెచ్చిన విద్యార్థులు బాడ శ్రీజ, మట్ట హర్ష, జె.నిహారిక వై.రూప్ కుమార్, ఎన్.చందులను ప్రధానోపాధ్యాయుడు సుందర్ సాల్మన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.



### ఎయిర్‌పోర్ట్ భూముల రహస్య సర్వేపై..

# తహసీల్దార్‌ను నిలదీసిన సభ్యులు

-మౌనం వహించిన తహసీల్దార్ సీతారామ్మూర్తి

-ఎంపీపీ నీలవేణి... ఎమ్మెల్యే శిరీష మధ్య వాగ్వివాదం

- పరిశ్రమలు వస్తే వలసల నివారణ : ఎమ్మెల్యే శిరీష

-భావనపాడు-మూలపేట మధ్యలో పెట్రో కెమికల్ ఫ్యాక్టరీ

**వజ్రపుకొత్తూరు, జనవరి 21(వార్త):**ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం రైతులకు తెలియకుండా రహస్యంగా భూ సర్వే చేయడం సరికాదని సభ్యులు మెట్టూరు చీపురుపల్లి సభ్యులు కొండ సురేఖ, తిర్రి గుణ సభలో రెవెన్యూ అధికారులను నిలదీశారు. మండల ఎంపీపీ ఉప్పరపల్లి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పలాస ఎమ్మెల్యే గౌత శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు సురేఖ, గుణ మాట్లాడుతూ రహస్య సర్వేతో ఉద్దానం రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారని వాపోయారు. ఈ గ్రామాల్లో ఉద్యమాలు వచ్చే పరిస్థితి ఉందని, స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి వస్తుందని, ప్రజల మధ్యనే సమస్య పరి ష్కారం కావాలని సభ్యులు సభలో వెల్లడించారు. దీనిపై స్పష్టమైన వివరణ రెవెన్యూ అధికారి సీతారామమూర్తి తెలియ జేయాలని డిమాండ్ చేశారు. అయితే రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పలేక పోవడంతో ఎమ్మెల్యే గౌతు శిరీష జోక్యం చేసుకున్నారు. ఎయిర్‌పోర్టుతో నిరుద్యోగ సమస్య పరి ష్కారమవుతుందని, వెనుకబడిన జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని, అందరూ పార్టీలకతీ తంగా సహకరించాలని, పరిశ్రమలు వస్తే అభివృద్ధి జరుగు తుందని వెల్లడించారు. పరిశ్రమల ఇతర రాష్ట్రాల్లో వలస కూలీలుగా ఈ జిల్లా వాసులు కొనసాగుతున్నారని ,ఈ ఉద్దే శం మేరకే మన శ్రీకాకుళం జిల్లాలో పరిశ్రమలు వస్తే నిరు ద్యోగులను ఉద్యోగులుగా చేయాలనే తపన, ఆలోచన, లక్ష్యం తో పనిచేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో భావనపాడు- మూలపేట మధ్యలో మరో పరిశ్రమ స్థాపించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మినిస్టర్ లోకేష్ సమక్షంలో రంగం సిద్ధమైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







# నేర నియంత్రణకు పటిష్ట చర్యలు: ఎస్పీ

**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** ప్రతి పోలీసు అధికారి అంకితభావంతో విధులు నిర్వర్తించి, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం, కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో ఉన్న పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పీజీఆర్ఎస్ పిర్యాదులు, మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, గ్రేవ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యలు,తదితర కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముందుస్తు సమాచారం, ప్రత్యేక కార్యాచరణతో జిల్లాలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టి జిల్లా ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఏర్పాటు చేసి ఉక్కు పాదం మోపాలన్నారు. ప్రతీ రోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ ద్వారా ముఖ్యమైన కూడలిలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. పేకాట శిబిరాలు పై విస్తృతంగా రైడ్స్ నిర్వహించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టాలన్నారు. నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు, ఆలయాలు, ముఖ్య కూడలిలో సి.సి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు.



### ప్రతిభకు ప్రశంస..

జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ పరిధిలో నమోదు కాబడిన కేసులలో నేరస్తులను పట్టుకోవడం, కేసుల ఛేధింపు, దర్యాప్తు,కేసు ప్రాపర్టీ స్వాధీనంలో ప్రతిభ కనబరిచిన సీఐలు పైడిపు నాయడు, ప్రసాద్ రావు, సత్యానారాయణ, పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.

ఈ సమావేశంలో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) కెవి రమణ,డీఎస్పీలు సిహెచ్ వివేకానంద, డిఎస్ఆర్వి ఎస్ఎన్ మూర్తి, ప్రసాద్ రావు సిఐలు, ఎస్సైలు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు కృషితో ఉక్కుకు భరోసా

**పాతపట్నం, జనవరి 21(వార్త):**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి కృషితో విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థిక భరోసా లభించిందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు.. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ,సీఎం చంద్రబాబు కృషి పట్టుదలతో ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ. 11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ సాధించారన్నారు. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేయడం అభినందనీయమన్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న స్టీల్ ప్లాంట్ ను గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే అప్పుల్లో కూరుకుపోయిందని గుర్తుచేశారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర



అభివృద్ధితోపాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటు ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం భారీ సాయాన్ని ప్రకటించిందని ఎమ్మెల్యే వివరించారు.

## డ్రోన్ నిఘా నీడలో శ్రీకాకుళం



**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం,పేకాట వంటి ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగేందుకు అవకాశం ఉన్న శ్రీకాకుళం నగరం శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా కొనసాగుతుంది. శ్రీకాకుళం జిల్లా శ్రీ మహేశ్వర రెడ్డి ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మంగళవారం దమ్ములవీధి,కంపోస్ట్ కాలనీ ఎంఐజి కాలనీ,డచ్ బంగాల,హయత్ నగర్, పొన్నాడ,కొత్త, డే అండ్ నైట్ వంతెనల నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో ప్రత్యేకంగా పెట్టడం జరిగింది.బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి వినియోగించిన పేకాట, ఈవ్ టీజింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కు పాల్పడినవారు పట్టుబడినట్లయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ శ్రీ కేవీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం నగరం డ్రోన్ నిఘా నీడలో ఉందని యువత మత్తు పదార్థాలకు బానిసై నిర్మాణష్యమైన ప్రదేశాల్లో తిరగవద్దని, ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఉచిత పశు వైద్య శిబిరాన్ని..
## ప్రారంభించిన ఎమ్మెల్యే ఎంజీఆర్

**పాతపట్నం, జనవరి 21(వార్త):** ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు అన్నారు. తిడ్డిమి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. పశువులకు ట్యాగింగ్ చేయించుకోవాలని, గాలి కుంటు టీకాలు వేయించాలని సూచించారు. ఎటువంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చని తెలిపారు. పాడి పశువుల పెంపక రైతులకు పశు వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు, కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగాల పోటీల పోస్టర్ ఆవిష్కరణ



**టెక్కలి, జనవరి 21(వార్త):** విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంలో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించు రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోస్టర్ టెక్కలి ఉప విద్యాశాఖ అధికారి విలియమ్ మంగళవారం టెక్కలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రయోగ పోటీలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం -సుస్థిర అభివృద్ధి, మూఢనమ్మకాలు- శాస్త్రీయ దృక్పథం అనే మూడు అంశాలపై విద్యార్థులు ప్రయోగాలు చేసి దానిని ఇంటి వద్ద గాని లేదా పాఠశాల వద్ద గాని వీడియో చేసి గూగుల్ ఫామ్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ పోటీలలో పాల్గొనడానికి ఫిబ్రవరి 15 తేదీ ఆఖరి తేదీ అని తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగతంగా గాని బృందం సభ్యులు గాని పాల్గొవచ్చని అకాడమిక్ విభాగం కన్వీనర్ పాలవలస ధర్మారావు తెలియజేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలవరం సైన్స్ ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546